09-10-2021 ఉదయము : మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

" మధురమైన పిల్లలూ - మాతా - పితలను అనుసరించి సింహాసనాధికారులుగా అవ్వండి, ఇందులో ఏ కష్టమూ లేదు.కేవలంతండ్రిని స్మృతిచేయండి,పవిత్రంగా అవ్వండి. "

ప్రశ్న :- పేదల పెన్నిధి అయిన తండ్రి తన పిల్లల భాగ్యాన్ని తయారు చేసేందుకు ఏ సలహానిస్తారు ?

జవాబు :- పిల్లలారా, శివబాబాకు మీదేదీ అవసరం లేదు. మీరు భలే తినండి, తాగండి, చదవండి - రిఫ్రెష్ అయి వెళ్లండి కానీ పిడికెడు బియ్యానికి కూడా మహిమ ఉంది. 21 జన్మలకు శ్రీమంతులుగా అవ్వాలి. అందుకు పేదవారి ఒక్క రూపాయి కూడా శ్రీమంతుల నూరు రూపాయలకు సమానం కనుక తండ్రి ఎప్పుడు డైరెక్టు(ప్రత్యక్షం)గా వస్తారో అప్పుడు మీ సర్వస్వాన్ని సఫలం చేసుకోండి.

పాట :- మీరే తల్లి, మీరే తండ్రి,.... (తుమ్ హీ హెూ మాతా - పితా....)

ఓంశాంతి. పిల్లలు పాటను అర్థము చేసుకున్నారు. ప్రపంచంలోని వారు పిలుస్తూ ఉంటారు కానీ వారికి అర్థము తెలియదు. వారు మన తండ్రి అని మీకు తెలుసు. వాస్తవానికి వారు కేవలం మీకు మాత్రమే తండ్రి కాదు, అందరి తండ్రి కూడా వారే. ఇది కూడా అర్థము చేసుకోవలసిన విషయం. ఆత్మలందరి తండ్రి తప్పకుండా పరమాత్మయే. 'బాబా - బాబా' అని అనడం వలన వారసత్వం తప్పకుండా స్మృతిలోకి వస్తుంది. బాబాను స్మృతి చేయడం వల్లనే వికర్మలు వినాశనమౌతాయి. మీ ఆత్మ పతితమై ఉంది, ఇప్పుడు దానిని పావనంగా చేసుకోవాలని బాబా పిల్లలకు చెప్తారు. వారు సర్వుల పిత కనుక పిల్లలు తప్పకుండా నిర్వికారులుగా అవ్వాలి. ఒక సమయంలో అందరూ నిర్వికారులుగా ఉండేవారు. బాబా స్వయంగా చెప్తారు - శ్రీలక్ష్మీనారాయణుల రాజ్యమున్నప్పుడు అందరూ నిర్వికారులుగా ఉండేవారు. ఎంతమంది మనుష్యాత్మలను చూస్తున్నారో, వారు కూడా నిర్వికారులుగా ఉంటారు ఎందుకంటే శరీరం వినాశనమౌతుంది. ఆత్మలందరూ నిరాకారీ ప్రపంచానికి వెళ్లి ఉంటారు. అక్కడ వికారాలకు నామ-రూపాలు కూడా ఉండవు. అసలు శరీరమే ఉండదు. అక్కడ నుండే ఆత్మలందరూ ఈ ప్రపంచంలో పాత్రను అభినయం చేసేందుకు వస్తారు. మొట్టమొదట భారతవాసులు వస్తారు. భారతదేశంలో మొట్టమొదట ఈ లక్ష్మీనారాయణుల రాజ్యముండేది. అప్పుడు మిగిలిన ధర్మాల వారందరూ నిరాకార ప్రపంచంలో ఉంటారు. ఈ సమయంలో అందరూ సాకార ప్రపంచంలో ఉన్నారు. ఇప్పుడు తండ్రి పిల్లలైన మిమ్ములను నిర్వికార దేవీ దేవతలుగా చేసేందుకు నిర్వికారులుగా చేస్తారు. ఎప్పుడు మీరు దేవీదేవతలుగా అవుతారో అప్పుడు మీ కొరకు నూతన ప్రపంచం తప్పకుండా కావాలి. పాత ప్రపంచం సమాప్తమవ్వాలి. శాస్త్రాలలో మహాభారత యుద్ధము

కూడా చూపించారు. 5 మంది పాండవులు మిగిలారని, వారు కూడా కొండల పై కరిగిపోయారని, ఎవ్వరూ మిగలలేదని చూపించారు. అయితే ఇంతమంది ఆత్మలు ఎక్కడికి పోయారు? ఆత్మ వినాశనమవ్వదు. నిర్వికారీ, నిరాకారీ ప్రపంచంలోకి వెళ్లారని అంటారు. తండ్రి వికారీ ప్రపంచం నుండి నిరాకారి, నిర్వికారి ప్రపంచంలోకి తీసుకెళ్తారు. తండ్రి నుండి తప్పకుండా వారసత్వం లభించాలని మీకు తెలుసు. ఇప్పుడు దు:ఖము చాలా ఎక్కువయ్యింది. ఈ సమయంలో మనకు సుఖము - శాంతి రెండూ కావాలి. ఓ భగవంతుడా! మాకు సుఖాన్నివ్వండి, శాంతినివ్వండి అని భగవంతుని అందరూ వేడుకుంటారు. ప్రతి మానవుడు ధనము కొరకే పురుషార్థం చేస్తున్నాడు. ధనముంటే సుఖముంటుంది. మీకు అనంతమైన తండ్రి చాలా ధనమునిస్తారు. మీరు సత్యయుగంలో ఎంతో ధనవంతులుగా ఉండేవారు, వజ్ర వైడూర్యాల భవనాలుండేవి. మనముఅనంతమైన తండ్రి నుండి అనంతమైన స్వర్గ వారసత్వం తీసుకునేందుకు వచ్చామని పిల్లలైన మీకు తెలుసు. మొత్తం ప్రపంచమంతా స్వర్గంలోకి రాదు. తండ్రి భారతదేశంలోనే వస్తారు. భారతవాసులు ఈ సమయంలో నరకవాసులుగా ఉన్నారు మళ్ళీ వారిని తండ్రి స్వర్గ వాసులుగా తయారుచేస్తారు. భక్తిమార్గంలో దు:ఖము కారణంగా తండ్రిని అనేక జన్మలు స్మృతి చేశారు. *'ఓ పరమపిత పరమాత్మ, ఓ కళ్యాణకారీ, దు:ఖహర్త - సుఖకర్త '* అని వారిని స్మృతి చేస్తూ వచ్చారు. కనుక తప్పకుండా వారు ఎప్పుడో వచ్చి ఉంటారు. ఊరికే స్మృతి చేయరు. భగవంతుడైన తండ్రి వచ్చి భక్తులకు ఫలాన్ని ఇస్తారని భావిస్తారు. మరి అందరికీ ఇస్తారు కదా. వారు అందరికీ తండ్రియే కదా.

మనము సుఖధామంలోకి వెళ్తామని మీకు తెలుసు. మిగిలిన వారంతా శాంతిధామానికి వెళ్తారు. ఎప్పుడు సుఖధామంలో ఉంటారో, అప్పుడు పూర్తి సృష్టిలో సుఖ-శాంతులుంటాయి. తండ్రికి పిల్లల పై ప్రేమ ఉంటుంది కదా. పిల్లలకు కూడా తల్లిదండ్రుల పై ప్రేమ ఉంటుంది. మీరే తల్లి-తండ్రి,.... అని కూడా మహిమ చేస్తారు. దేహధారి తల్లిదండ్రులున్నా మీరే తల్లి తండ్రి,... మీ కృపతో అపారమైన సుఖము లభిస్తుందని మహిమ చేస్తారు. లౌకిక తల్లిదండ్రుల గురించి ఎప్పుడూ ఇలా పాడరు. భలే వారు కూడా పిల్లలను సంభాళన చేస్తారు, శ్రమ పడ్తారు, వారసత్వమునిస్తారు, వివాహం చేస్తారు. అయినా అపారమైన సుఖాన్ని పారలౌకిక తల్లిదండ్రులు మాత్రమే ఇస్తారు. ఇప్పుడు మీరు ఈశ్వరీయ ధర్మానికి చెందిన పిల్లలు. మిగిలినవారంతా ఆసురీ ధర్మానికి చెందిన పిల్లలు. సత్యయుగంలో ఎప్పుడూ పిల్లలను దత్తు చేసుకోరు. అక్కడ అపారమైన సుఖముంటుంది. దు:ఖానికి నామ-రూపాలు కూడా ఉండవు. 21 జన్మలకు మీకు స్వర్గంలో అపారమైన సుఖాన్నిచ్చేందుకు నేను వచ్చానని తండ్రి చెప్తారు.

అనంతమైన తండ్రి నుండి మనము అపారమైన స్వర్గ సుఖాలనుపొందుకుంటామని ఇప్పుడు మీకు తెలుసు. ఈ దు:ఖ బంధనాలన్నీ సమాప్తమౌతాయి. సత్యయుగంలో సుఖ సంబంధాలుంటాయి, కలియుగంలో దు:ఖ బంధనాలుంటాయి. తండ్రి మనలను సుఖ సంబంధాలలోకి తీసుకెళ్తారు. వారిని దు:ఖహర్త - సుఖకర్త అని కూడా అంటారు. తండ్రి వచ్చి పిల్లలకు సేవ చేస్తారు. నేను మీ విధేయుడనైన సేవకుడను అని తండ్రి అంటారు. ఓ బాబా, మీరు వచ్చి మాకు అపారమైన సుఖాన్ని ఇవ్వండి అని నన్ను మీరు అర్థకల్పము స్మృతి చేశారు. ఇప్పుడు నేను అవి ఇచ్చేందుకు వచ్చాను కనుక శ్రీమతాన్ని అనుసరించండి. ఈ మృత్యులోకమంతా సమాప్తమవ్వనున్నది. అమరలోకం స్థాపనౌతుంది. అమరపురికి వెళ్లేందుకు అమరనాథుడైన బాబా నుండి మీరు అమరకథను వింటున్నారు. అక్కడ ఎవ్వరూ మరణించరు. ఫలానావారు మరణించారని నోటి ద్వారా ఎప్పుడూ చెప్పరు. నేను



ఈ శిథిలమైన శరీరాన్ని వదిలి కొత్తది తీసుకుంటానని ఆత్మ అంటుంది. అది మంచిదే కదా. అక్కడ ఏ అనారోగ్యాలు మొదలైనవి ఉండవు. మృత్యులోకం పేరే ఉండదు. మిమ్ములను అమరపురికి అధికారులుగా చేసేందుకు నేను వచ్చాను. అక్కడ మీరు ఎప్పుడు రాజ్యము చేస్తారో అప్పుడు మృత్యులోకపు స్మృతులేవీ ఉండవు. క్రిందకు దిగుతూ దిగుతూ మేము ఎలా అయిపోతామో అని కూడా తెలియదు. అది తెలిస్తే సుఖమే ఉండదు. ఇక్కడ మీరు పూర్తి చక్రాన్ని బుద్ధిలో ఉంచుకోవాలి. ఒకప్పుడు స్వర్గముండేది, ఇప్పుడు నరకముంది. అందుకే తండ్రిని పిలుస్తారు. ఆత్మలైన మీరు శాంతిధామ నివాసులు. ఇక్కడకు వచ్చి పాత్రను అభినయిస్తారు. ఇంటికి వెళ్ళునప్పుడు ఇక్కడనుండి సంస్కారాలను

తీసుకెళ్తారు. మళ్ళీ అక్కడ నుండి వచ్చి నూతన శరీరాన్ని ధారణ చేసి రాజ్యపాలన చేస్తారు. ఇప్పుడు మీకు నిరాకారి, ఆకారి మరియు సాకార ప్రపంచాల సమాచారాన్ని వినిపిస్తారు. సత్యయుగంలో వీటి గురించి ఏమీ తెలియదు. అక్కడ కేవలం రాజ్యం చేస్తారు. మీరు డ్రామాను ఇప్పుడే తెలుసుకున్నారు. సత్యయుగం కొరకు మనము పురుషార్థం చేస్తున్నామని మీ ఆత్మకు తెలుసు. స్వర్గంలోకి వెళ్లేందుకు తప్పకుండా యోగ్యులుగా అవుతాము. మీ కళ్యాణాన్ని, ఇతరుల కళ్యాణాన్ని కూడా చేస్తారు. వారి ఆశీర్వాదాలు మీకు లభిస్తూ ఉంటాయి. మీ ప్లాను ఎలా ఉందో చూడండి. ఈ సమయంలో అందరికీ తమ - తమ ప్లాన్లు ఉన్నాయి. తండ్రికి కూడా ప్లాను ఉంది. వారు డ్యాములు(ఆనకట్టలు) మొదలైనవి నిర్మించునప్పుడు విద్యుత్తు మొదలైన వాటి కొరకు ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తారు. ఇప్పుడు అవన్నీ ఆసురీ ప్లాన్లని తండ్రి చెప్తారు. మీది ఈశ్వరీయ ప్లాను. ఇప్పుడు ఎవరి ప్లాను విజయం పొందుతుంది. వారు పరస్పరంలో పోట్లాడుకుంటారు. అందరి ప్లాన్లు మట్టిలో కలిసిపోతాయి. వారెవ్వరూ స్వర్గ స్థాపన చేయలేరు. వారు ఏం చేసినా, అది దు:ఖము కొరకే. స్వర్గ నిర్మాణం చేసే ప్లాను తండ్రిది. నరకవాసులైన మనుష్యులు నరకంలోనే ఉండేందుకు ప్లాన్లు తయారుచేస్తారు. స్వర్గాన్ని నిర్మించేందుకు ఇప్పుడు తండ్రి ప్లాను నడుస్తోంది. కనుక మీకు ఎంత సంతోషముండాలి. మీ కృపతో అపారమైన సుఖము,.... అని గానము చేస్తారు. ఆ పురుషార్థం చేయాలి కదా. తండ్రి అంటారు - మీకు ఏం కావాలో, అది తీసుకోండి, విశ్వానికి అధికారులుగా, రాజా-రాణులుగా అయినా అవ్వండి లేక దాస-దాసీలుగా అయినా అవ్వండి. ఎంత పురుషార్థం చేస్తారో అంత పొందుతారు. కేవలం తండ్రి అంటారు - పవిత్రంగా అవ్వండి అంతేకాక ప్రతి ఒక్కరికి తండ్రి పరిచయాన్ని ఇస్తూ వెళ్లండి. తండ్రిని(అల్ఫ్‌ను) స్మృతి చేసినట్లైతే సామ్రాజ్యము(బే) మీదౌతుంది. తండ్రిని స్మృతి చేయడంలోనే మాయ చాలా విఘ్నాలను కలిగిస్తుంది. బుద్ధియోగాన్ని దూరం చేస్తుంది. తండ్రి చెప్తారు - నన్ను ఎంత స్మృతి చేస్తారో, అంత పాపాలు కూడా భస్మమౌతాయి, ఉన్నత పదవిని కూడా పొందుతారు. కనుక భారతదేశ ప్రాచీన యోగము చాలా ప్రసిద్ధమైనది. తండ్రిని ముక్తిదాత అని కూడా అంటారు. 21 జన్మల కొరకు తండ్రి మిమ్ములను దు:ఖము నుండి విడుదల చేస్తారు. భారతవాసులు సుఖధామంలో ఉంటారు. మిగిలినవారంతా శాంతిధామంలో ఉంటారు. నిరాకార ప్రపంచ ప్లాను, సాకార ప్రపంచ ప్లాను చూపించినప్పుడు ఇతర ధర్మాల వారు స్వర్గంలోకి రాలేరని, స్వర్గంలో దేవీ దేవతలు మాత్రమే ఉంటారని వెంటనే అర్థం చేసుకుంటారు. ఈ డ్రామా జ్ఞానాన్ని తండ్రి తప్ప వేరెవ్వరూ అర్థం చేయించలేరు. తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునేందుకే పిల్లలు తండ్రి వద్దకు వస్తారు. సత్యయుగంలోనే అపారమైన సుఖముంటుంది, తర్వాత రావణ రాజ్యము వస్తుంది. అందులో అపారమైన

దు:ఖముంటుంది. తండ్రి మనకు సత్య-సత్యమైన కథను వినిపించి అమరలోకంలోకి వెళ్లేందుకు యోగ్యులుగా తయారు చేస్తున్నారని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. ఇప్పుడు అలాంటి కర్మలు చేస్తున్న కారణంగానే 21 జన్మలకు ధనవంతులుగా అవుతారు. ధనవాన్‌భవ, పుత్రవాన్ భవ..... అని కూడా అంటారు. అక్కడ ఒక పుత్రుడు, ఒక పుత్రిక మీకు తప్పకుండా ఉంటారు. మీ ఆయువు కూడా 150 సంవత్సరాలుంటుంది. అకాల మృత్యువులు ఎప్పుడూ సంభవించవు. ఇది తండ్రియే అర్థం చేయిస్తారు - మీరు అర్ధకల్పము నుండి నన్ను పిలుస్తూ వచ్చారు. సన్యాసులు ఎవరైనా ఇలా చెప్తారా? వారికేం తెలుసు! బాబా ఎంత ప్రేమగా అర్థం చేయిస్తారు - పిల్లలారా, ఈ ఒక్క జన్మలో పావనంగా అయితే 21 జన్మలకు పావన ప్రపంచానికి యజమానులుగా అవుతారు. పవిత్రతలో సుఖముంది కదా. మీరు పవిత్రమైన దైవీ ధర్మానికి చెందినవారు. ఇప్పుడు అపవిత్రులుగా అయ్యి దు:ఖంలోకి వచ్చారు. స్వర్గంలో నిర్వికారులుగా ఉండేవారు. ఇప్పుడు వికారులుగా అవ్వడం వలన నరకంలో దు:ఖితులుగా అయ్యారు. తండ్రి పురుషార్థం చేయిస్తారు కదా. స్వర్గంలో మహారాజు - మహారాణులుగా అవ్వండి. మీ బాబా - మమ్మా అలా అవుతారు కదా. మీరు కూడా పురుషార్థం చేయండి. ఇందులో తికమకపడే విషయమే లేదు. బాబా ఎవ్వరినీ కాళ్లకు నమస్కారం కూడా చేయనివ్వరు.



తండ్రి అంటారు - నేను మీకు బంగారు, వజ్రాల మహళ్ళను ఇచ్చాను. స్వర్గానికి అధికారులుగా చేశాను. మళ్ళీ అర్ధకల్పం మీరు భక్తిమార్గంలో నమస్కరిస్తూ మీ నుదురు అరగదీసుకుంటూ వచ్చారు. ధనము కూడా ఖర్చు చేస్తూ వచ్చారు. ఆ బంగారు, వజ్రాల మహళ్ళన్నీ ఎక్కడికి వెళ్ళాయి? స్వర్గము నుండి దిగుతూ దిగుతూ నరకంలోకి వచ్చి పడ్డారు. ఇప్పుడు నేను మిమ్ములను మళ్ళీ స్వర్గంలోకి తీసుకెళ్తాను. మీకు ఏ కష్టాన్నీ ఇవ్వను. కేవలం నన్ను స్మృతి చేయండి, పవిత్రంగా అవ్వండి. భలే ఒక్క పైసా కూడా ఇవ్వకండి. తినండి, తాగండి, చదవండి, రిఫ్రెష్ అయ్యి వెళ్ళండి. తండ్రి కేవలం చదివిస్తారు. ఈ చదువుకు ధనాన్ని ఏమీ తీసుకోరు. బాబా, మేము తప్పకుండా ఇస్తాము, లేకుంటే అక్కడ మహళ్ళు ఎలా లభిస్తాయి? అని అంటారు. భక్తిమార్గంలో కూడా మీరు ఈశ్వరార్థము పేదలకు దానం చేసేవారు. ఫలము కూడా ఈశ్వరుడే ఇస్తారు, పేదలు ఇవ్వరు. కానీ అది ఒక్క జన్మకు మాత్రమే లభిస్తుంది. బాబా, మీరు ఇప్పుడు డైరెక్టుగా వచ్చారు. మేము ఈ కొద్ది ధనాన్ని ఇస్తాము, మీరు మాకు 21 జన్మలకు స్వర్గంలో ఇవ్వండి అని అంటారు. తండ్రి అందరినీ శ్రీమంతులుగా తయారుచేస్తారు. ధనమిస్తే మీరు ఉండేందుకే గృహాలు మొదలైనవి నిర్మిస్తారు. లేకుంటే ఇవన్నీ ఎలా తయారౌతాయి? పిల్లలే ఈ ఇళ్ళు మొదలైనవి నిర్మిస్తారు. శివబాబా అంటారు - నేను వీటిలో ఉండను. శివబాబా నిరాకారుడైన దాత కదా. మీరు ఇక్కడ ఇవ్వడం వలన మీకు 21 జన్మల కొరకు ఫలాన్ని ఇస్తారు. నేను మీ స్వర్గంలోకి కూడా రాను. మిమ్ములను నరకం నుండి వెలికి తీసేందుకు నేను నరకంలోనే రావలసి ఉంటుంది. మీ గురువులు మొదలైన వారు ఇంకా మిమ్ములను ఊబిలో చిక్కుకునేలా చేస్తారు. వారెవ్వరూ సద్గతినివ్వరు. ఇప్పుడు పవిత్ర ప్రపంచానికి తీసుకెళ్ళేందుకు తండ్రి వచ్చారు. అలాంటి తండ్రిని ఎందుకు స్మృతి చేయరు? తండ్రి చెప్తారు - మీరేమీ ధనాన్ని ఇవ్వకండి. కేవలం నన్ను స్మృతి చేసినట్లైతే పాపాలు నాశనమై నా వద్దకు వచ్చేస్తారు. ఈ ఇల్లు మొదలైనవి మీరు మీ కొరకే నిర్మించుకున్నారు. ఇక్కడ పిడికెడు బియ్యానికి మహిమ ఉంది కదా. పేదవారు తమ శక్త్యానుసారం ఎంత ఇస్తారో, అంత వారి భాగ్యం కూడా తయారౌతుంది. శ్రీమంతులకు ఎంత పదవి లభిస్తుందో పేదవారికు కూడా అంత పదవి లభిస్తుంది. ఇరువురిదీ సమానమవుతుంది. పేదవారి వద్ద 100 రూపాయలున్నప్పుడు అందులో నుండి ఒక్క రూపాయి ఇచ్చినా, శ్రీమంతులు 100 రూపాయలు ఇచ్చినా, ఇరువురికి ఒకే ఫలముంటుంది. కనుక తండ్రిని పేదలపెన్నిధి అని అంటారు. భారతదేశం అన్నిటికంటే పేదదేశం. నేను వచ్చి దానినే ధనవంతంగా చేస్తాను. పేదవారికే దానము ఇవ్వబడుతుంది కదా. తండ్రి ఎంత స్పష్టం చేసి అర్థం చేయిస్తున్నారు! పిల్లలారా, ఇప్పుడు మృత్యువు సమీపంలో నిలిచి ఉంది. ఇప్పుడు త్వరపడండి. స్మృతి చేసే వేగాన్ని పెంచండి.

అతిమధురమైన తండ్రిని ఎంత స్మృతి చేస్తారో అంత వారసత్వం లభిస్తుంది. మీరు చాలా ధనవంతులుగా అవుతారు. తల వంచి నమస్కరించండి, ఉత్సవాలు, తిరునాళ్ళకు వెళ్ళండి అని తండ్రి మీకు చెప్పరు. ఇంట్లో కూర్చొని తండ్రిని, వారసత్వాన్ని స్మృతి చేయండి. చాలు. తండ్రి ఒక బిందువు, వారిని పరమపిత పరమాత్మ అని అంటారు. సుప్రీమ్ సోల్ అందరికన్నా ఉన్నతాతి ఉన్నతమైనవారు. తండ్రి అంటారు - నేను కూడా బిందువునే, మీరు కూడా బిందువులే. కేవలం భక్తిమార్గంలో నా రూపాన్ని పెద్దదిగా తయారుచేసి ఉంచారు. లేకుంటే బిందువును ఎలా పూజిస్తారు? వారిని శివబాబా అని కూడా అంటారు. ఈ మాట ఎవరంటారు? శివబాబా మాకు వారసత్వమునిస్తున్నారని ఇప్పుడు మీరు అంటారు. ఇదొక అద్భుతం కదా. 84 జన్మల చక్రము తిరుగుతూ ఉంటుంది. అనేకసార్లు మీరు వారసత్వం తీసుకున్నారు ఇంకా అనేకసార్లు తీసుకుంటూనే ఉంటారు. తండ్రి ఎంత బాగా అర్థం చేయిస్తున్నారు. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల

పిర్రుస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. మృత్యువు మీ ముందే నిల్చొని ఉంది కనుక ఇప్పుడు స్మృతి చేసే వేగాన్ని పెంచాలి. సత్యయుగ ప్రపంచంలో ఉన్నత పదవిని పొందేందుకు పూర్తి పురుషార్థం చేయాలి.

2. స్వ కళ్యాణం, ఇతరుల కళ్యాణం చేసి ఆశీర్వాదాలను పొందాలి. పవిత్ర ప్రపంచానికి వెళ్ళేందుకు తప్పకుండా పవిత్రంగా అవ్వాలి.

వరదానము :- " కొత్త జీవితం యొక్క స్మృతి ద్వారా కర్మేంద్రియాలపై విజయం ప్రాప్తి చేసుకునే మరజీవా భవ "

ఏ పిల్లలైతే పూర్తి మరజీవాగాఅయ్యారో వారికి కర్మేంద్రియాల ఆకర్షణ ఉండజాలదు. మరజీవాగా అయ్యారు అనగా అన్ని వైపుల నుండి మరణించారు, పాత ఆయువు సమాప్తమయింది. కొత్త జన్మ జరిగినప్పుడు కొత్త జన్మ, కొత్త జీవితంలో కర్మేంద్రియాలకు ఎలా వశమవ్వగలరు? బ్రహ్మకుమార - కుమారీల కొత్త జీవితంలో కర్మేంద్రియాలకు వశమవ్వడం అంటే ఏమిటో కూడా తెలియకుండా ఆ జ్ఞానము నుండి కూడా అతీతంగా ఉంటారు. కొద్దిగా కూడా శూద్ర తనపు శ్వాస అనగా సంస్కారం ఎక్కడా చిక్కుకొని ఉండరాదు.

స్లోగన్ :- " అమృతవేళ హృదయంలో పరమాత్మ స్నేహాన్ని నింపుకుంటే ఏ ఇతర స్నేహము ఆకర్షింపజాలదు "

-: ఓంశాంతి :-